## సింగిల్ పేజీ కథలు

''ఏం గొప్ప ఊరు దిబ్బ, ఇదేగా మీ పుట్టింటి గొప్పతనం. పెళ్లయి పదేళ్లయినా అల్లుడికి కొత్తబట్టలు కుట్టిద్దామనో, మనవరాలికి కనీసం కాళ్లపట్టీలు తెద్దామనో ఆలోచనైనా మీ వాళ్లకు రాదా. అదే పక్కింటి రంగనాథాన్ని చూడు. పండగలనో, పబ్బాలనో అత్తారింటికి వెళుతూనే ఉంటాడు. ఏవో కొత్త కానుకలతో వస్తూనే వుంటాడు. అలా ఉండాలి అత్తామామలంటే. నాకూ ఉన్నారు. ఎందుకూ ఏట్లో కలిపెయ్యడానికా'' అవకాశం దొరికితే చాలు ఇలాంటి ఎత్తిపొడుపు మాటలతో భార్యను సతాయించేవాడు రామారావు.

'నా పుట్టింటివాళ్లు బాగా ఉన్నవాళ్లని గొప్పలు చెప్పుకోవడమే కానీ, వాళ్ల నుండి పీసమెత్తయినా లాభం లేదు. అలాంటప్పుడు భర్త యిలా మాట్లాడడంలో తప్పేమీ లేదు' భర్త మాటలకు బాధ కలుగుతున్నా నిజానికి జరుగుతున్నదే కాబట్టి తనను తాను సముదాయించుకునేది కోమలి.

శ్రీపురంలోకెల్లా ధనవంతుడు నారాయణమూర్తి. ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లతో దర్జాగా జీవించేవాడు. అయితే తన మేలు తాను చూసుకునే వాడే కానీ ఊరి వారికి మాత్రం ఏ విధంగా సాయం చేసేవాడు కాదు. ధనవంతుడు కాబట్టి గౌరవించే వాళ్లే కానీ నారాయణమూర్తిపై ఎవరికి సదభిప్రాయం లేదు.

పెద్దల్లుడు రామారావు సాత్వికుడు. పరుల నుండి ఏ లాభాన్ని ఆశించే వాడు కాదు. అత్తమామలు సరిగా చూడకపోయినా ఏమాత్రం పట్టించుకునేవాడు కాదు. కానీ రామారావుతో పాటు పనిచేసే టీచర్లు సందర్భం వచ్చిందంటే చాలు వాళ్ల అత్తామామల గొప్పతనాన్ని గూర్చి చిలవలుపలవలుగా చెప్పేవారు. రామారావు మనసులో కూడా ఆలోచన మొదలయింది.

'నా జీతంతో ఎలాగో సంసారాన్ని లాక్కొస్తున్నాను. నా కుటుంబ పరిస్థితి అత్తామామలకు తెలిసిందేగా. పైగా వాళ్లు సంపన్నులే కదా. అలాంటప్పుడు నేను ఆశపడడంలో తప్పేమీ లేదు' అనుకున్నాడు రామారావు. బాధ పెట్టడం ఇష్టం లేకపోయినా అల్లాగైనా మామగారి నుండి ఏమైనా రాలుతుందేమోనని భార్యను సతాయించడం మొదలుపెట్టాడు.

నారాయణమూర్తి రెండో అల్లుడు రాంప్రసాద్ మొదటి నుండి దుడుకు స్వభావం కల వాడు. పెళ్లయిన మొదటి నుండి ఏవేవో కోరికలతో తరుచుగా భార్యను పుట్టింటికి పంపేవాడు. తండ్రి ఈతాకులాంటి వాడని తెలిసినా చేతనైనంత రాల్చుకొనిపోయేది మాలిని.

# పుట్టింటి గౌరవం

ఏ జాతరకో అక్కాచెల్లెళ్లు కలుసుకునే వారు. ఒకరి కష్టాలు ఒకరు చెప్పుకొని ఉపశమనం పొందేవారు. ''అక్కా! మన పుట్టింటి వాళ్లా సాయం చేసే వారు కాదు. ఇక్కడేమో సూటి పోటి మాటలు. ఇలా ఎంతకాలం. మనం ఏదో ఒక ఉపాయం ఆలోచించకపోతే ఇలా బాధపడుతూ ఉండాల్సిందే'' అంది మాలిని.

''ఏ సాయం చేయకపోయినా ఏడాదికొక్కసారి, సారె పెట్టి పంపినా సంతోషంగా ఉండవచ్చు'' కొంగుతో ముక్కు తుడుచుకుంటూ పలికింది కోమలి.

''ఏరా ఆంజనేయులు.. రెండేళ్లుగా చూస్తున్నా పంట దిగుబడి తగ్గిపోతుందేమిట్రా. అయినా నీమధ్య వ్యవసాయంపై శ్రద్ధ చూపిస్తున్నట్లు లేదు. నీకు వ్యవహారాలెక్కువైనట్లున్నాయి రా'' కొడుకును మందలించాడు నారాయణమూర్తి.

''హరహర మహాదేవ శంభో!'' నారాయణమూర్తి ఇంటి ముందు గట్టిగా అరుస్తున్నాడు జంగందేవర.

''వెళ్లవయ్యా! పంటలు సరిగా పండడంలేదని నేనేడుస్తుంటే మధ్యలో నీదొక గొడవ'' కసురుకున్నాడు నారాయణమూర్తి.

''నీవు పొరపడుతుండావు సామీ లక్ష్మీదేవి నీ మీద చిన్నచూపు చూస్తోంది. ఇప్పట్నుంచి నీకంతా కింది వాటమే సామీ'' శంఖం ఊదుతూ పక్కింటి వైపు వెళ్లబోయాడు జంగందేవర.

''ఇదో జంగమయ్యా ఆగవయ్యా. అంత కోపమైతే ఎలా ఇలారా'' అంటూ జంగందేవరను వసారాలో కూర్చోబెట్టాడు. ''ఇప్పుడు చెప్పు జంగమయ్యా నా పరిస్థితి బాగుపడాలంటే నన్నేం చేయమంటావు'' అడిగాడు నారాయణమూర్తి.

''జంగందేవర ఆన. సాంబయ్య పలికిందే చెప్తా. నీకిద్దరు ఆడ బిడ్డలుండారు సామీ. ఆళ్లు ఎవరనుకున్నావు. సాక్షాత్తూ నీ ఇంట్లో వెలసిన మాలక్ష్మిలే. ఇప్పుడు ఆళ్ల శాపమే నీకు తగులుతుంది. నువ్వు ఇలాగే ఉన్నావంటే నీకు మిగిలేది చిప్పకూడే. ఇప్పటికైనా మేలుకొని ఏటేటా ఆయమ్మలకు సారె పెట్టి సల్లంగా సూడాలి సామి. ఆళ్ల దయ నీకున్నంత కాలం నీకెదురే లేదు. ఆపైన మీ సిత్తం. ఎళ్లొత్తా సామీ''అంటూ సంభావన తీసుకొని వెళ్లిపోయాడు జంగందేవర.

''అమ్మాయిలు పుట్టింటి నుండి సంతోషంగా వెళ్లేనే మనకు మంచిదని నెత్తినోరు కొట్టుకొని చెప్తున్నా. ఏనాడైనా నా మాట విన్నారా. ఎంతసేపూ మీరు, మీ కొడుకుల సుఖమే కానీ అమ్మాయిల గురించి గుర్తు చేసుకోకపోతిరి. ఇప్పుడు చూడండి. ఏం జరిగిందో. ఇప్పటికైనా అమ్మాయిలను పిలుచుకొని వచ్చి సారె పెట్టి పంపుదాం'' నారాయణమూర్తిని చీవాట్లు పెట్టింది భార్య.

''పెండ్లి చేసి పంపాం. ఇక నా పని అయిపోయింది. ఏటా పిలుచుకురావడం, సారె పెట్టి పంపడం, అంతా శుద్ధ దండుగ ఖర్చు అనుకున్నానే కానీ చూస్తే మొదటికే మోసం వచ్చేట్లుంది. ధనలక్ష్మిని దూరం చేసుకోవడమా...? అమ్మో తలుచుకుంటేనే భయమేస్తుంది'' అనుకున్నాడు నారాయణమూర్తి.

ప్రతి ఏటా అమ్మాయిలిద్దరిని పిల్చుకొని రావడం, సారె పెట్టి పంపడం, చిన్నచిన్న కానుకలివ్వడం చేసే వాడు నారాయణమూర్తి. అదేం విశేషమోకానీ ఆ యేటి నుండి పంటలు బాగా పండసాగాయి.

''రూపాయి ఖర్చు చేయాలంటే ఒకటికి పది సార్లు లెక్కలు వేసే మామగారు ఇద్దరు కూతుళ్లను పిలుచుకొని పోవడం, కానుకలివ్వడం, ప్రేమగా చూసుకోవడం ఇదంతా చూస్తుంటే చాలా చిత్రంగా ఉంది కదూ ప్రసాద్'' మనసులోని మాటను బయట పెట్టాడు రామారావు.

''ఏం జరిగిందే అంటే, నీ మరదలు నవ్వుతుందే కానీ ఏమీ చెప్పడం లేదు. అంతా అయోమయంగా ఉందన్నయ్యా'' అన్నాడు రాంప్రసాద్. ''ఏమైతేనేం అత్తామామలు మనల్ని బాగా చూసుకుంటున్నారు. అదే సంతోషం'' అనుకున్నారు తోడల్లుళ్లు.

''మనం వేసిన పాచిక ఎంత చక్కగా పనిచేసిందో జంగందేవర ట్రిక్కుతో మనకు సాధింపులు తప్పాయి. మన పుట్టింటి గౌరవం నిలిచింది'' అనుకుంటూ అసలు రహస్యం తెలిసిన అక్కాచెల్లెళ్లు ఇద్దరూ మనసారా నవ్వుకున్నారు.

**-టి.రామాంజనేయులు** (హాలహర్వి)★